సాక్షి
నంద్యాల
ఆదివారం । 24 । డిసెంబర్ । 2023



అన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి శనివారం బెంగళూరుకు చెందిన సి. సుష్మ రూ.1,00,116 విరాళంగా అందజేశారు.



కేసీకి నీటి విడుదల

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్ నుంచి కేసీ కాల్వకు 159 క్యూసెక్కుల నీరు విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు. డ్యాంలో 1.110 టీఎంసీల నీరు నిల్వ ఉందని చెప్పారు.



కొనసాగుతున్న మహాయజ్ఞం

శ్రీశైల క్షేత్రంలో నవకోటి జప అష్ట వింశతి మహాయజ్ఞ క్రతువు కొనసాగుతోంది. ఈ నెల 26న పూర్ణాహుతితో ఈ యజ్ఞం ముగుస్తుందని నిర్వాహకులు తెలిపారు.

8లో▸

న్యూస్‌రీల్

కరోనా లక్షణాలు కనిపిస్తే పరీక్ష చేయించుకోండి

నంద్యాలటౌన్: కరోనా కొత్త వేరియంట్ జేఎన్-1 వ్యాపిస్తున్న తరుణంలో ఎవరికైనా లక్షణాలు కనిపిస్తే పరీక్షలు చేయించుకోవాలని జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డాక్టర్ వెంకటరమణ సూచించారు. శనివారం ఆయన మాట్లాడుతూ విదేశాల నుంచి వచ్చేవారు, వారి కుటుంబ సభ్యులు జాగ్రత్తలు పాటించాలన్నారు. దీర్ఘకాలిక దగ్గు, జలుబు, జ్వరం ఉన్న వారు కచ్చితంగా సమీపంలోని ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో టెస్టులు చేయించుకోవాలని సూచించారు. వృద్ధులు, గర్భిణిలు, దీర్ఘకాలిక రోగులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అలాగే వ్యక్తిగత శుభ్రత పాటిస్తు రద్దీ ప్రాంతాల్లో మాస్క్ తప్పనిసరిగా ధరించాలని కోరారు.

రైతులు ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలి

గడివేముల: రబీలో రైతులు సాగు చేసిన పంటలను తప్పనిసరిగా ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి మోహన్‌రావు తెలిపారు. మండలంలోని దుర్వేశి ఆర్బీకేలో డాక్టర్ చరణ్ సింగ్ జన్మదినాన్ని పురస్కరించుకుని జాతీయ వ్యవసాయ రైతు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం రైతులు,వ్యవసాయ సిబ్బందితో అవగాహ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వరి పంటలో తక్కువ పెట్టుబడితో నాణ్యమైన అధిక దిగుబడిన సాధించడానికి రైతుభరోసా కేంద్రాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయన్నారు. రబీ సీజన్‌లో బోర్లు, బావుల కింద ఆరుతడి పంటలు వేసుకోవాలని సూచించారు. గ్రామ పరిధిలో ఈ ఏడాది వరి పంట సరాసరి దిగుబడి 35 – 40 బస్తాలు వచ్చిందన్నారు. ఆర్బీకేలో ఉన్న ఎరువుల నిల్వలను తనిఖీ చేశారు. తదనంతరం పొలంబడితో అధిక దిగుబడి సాధించిన వెంకటరెడ్డిని ఘనంగా సన్మానించారు. ఏఓ హేమసుందర్‌రెడ్డి, సర్పంచ్ మండ్ల మమత, వైఎస్సార్‌సీపీ నాయకుడు రమేష్ పాల్గొన్నారు.

పర్యాటకం.. సరికొత్త సౌరభం


- జిల్లాలో మరో రెండు గుహలు అందుబాటులోకి
- బిల్ల సర్గం, వాల్మీకి గుహల్లో శరవేగంగా అభివృద్ధి పనులు
- త్వరలో పర్యాటకుల సందర్శనకు అనుమతి

డోన్: పర్యాటక ఖిల్లాగా విరాజిల్లుతున్న నంద్యాల జిల్లాలో మరో రెండు పర్యాటక ప్రాంతాలు చేరబోతున్నాయి. ఇప్పటికే ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన బెలూం గుహలు జిల్లాలో ఉండటం విశేషం. వీటికి ఏమాత్రం తీసిపోని విధంగా మరో రెండు గుహలు యాత్రికుల సందర్శనకు సిద్ధమవుతున్నాయి. ప్రకృతి ఒడిలో సహజసిద్ధంగా ఏర్పడిన బిల్లసర్గం గుహలు, వాల్మీకి గుహల అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. గత ప్రభుత్వాల నిర్లక్ష్యంతో పర్యాటకులకు దూరంగా ఉన్న ఈ గుహలు రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి చొరవతో పర్యాటక కేంద్రాలుగా మారుతున్నాయి. డోన్ నియోజవకర్గం బేతంచెర్ల మండల కేంద్రానికి 3.5 కి.మీ దూరంలో కనుమకింద కొట్టాల గ్రామానికి సమీపంలో ఉన్న బిల్లసర్గం గుహలు 20 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించి ఉన్నాయి. అలాగే ప్యాపిలి మండల కేంద్రం నుంచి 20 కి.మీ దూరంలో హుస్సేనాపురం, నల్లమేకల పల్లి మీదుగా బోయ వాండ్లపల్లికి వెళ్లే మార్గంలో 30 ఎకరాల విస్తీర్ణంలో వాల్మీకి గుహలు ఉన్నాయి. పూర్వాశ్రమంలో వాల్మీకి మహర్షి ఈ గుహల్లో తపస్సు చేశారని, అందుకే ఈ గుహలకు వాల్మీకి గుహలుగా ప్రసిద్ధి చెందాయి. బిల్లసర్గం గుహలు, వాల్మీకి గుహలను పర్యాటక కేంద్రాలుగా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 6. కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టింది. జిల్లాలో ఇప్పటికే శ్రీశైలం, మహానంది, యాగంటి, అహోబిలం క్షేత్రాలతో పాటు, రాక్ గార్డెన్, బెలుం కేవ్స్, నల్లమల ఎకో పార్క్‌లు ఉండటంతో నిత్యం పర్యాటకుల రద్దీ కనిపిస్తోంది. ఈ క్రమంలోనే మరో రెండు గుహలు పర్యాటకులకు అందుబాటులోకి వస్తుండటంతో జిల్లా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



బిల్లసర్గం గుహల ఆవరణలో సీసీ రోడ్డు వేసిన దృశ్యం

భూతల స్వర్గంగా..



వాల్మీకి గుహలో రంగురంగుల విద్యుత్ కాంతులు

రాష్ట్రంలోని బొర్రా, బెలుం గుహలకు దీటుగా బిల్లసర్గం, వాల్మీకి గుహలను టూరిజం శాఖ అధికారులు వేగంగా తీర్చిదిద్దుతున్నారు. పర్యాటకులను విశేషంగా ఆకట్టుకునే రీతిలో సహజ సిద్ధంగా ఏర్పడిన రాతి, మట్టి ఆకృతులకు మరింత అందంగా కనిపించేలా లైటింగ్ ఏర్పాటు చేస్తున్నారు. ప్రస్తుతం 25 ఎకరాల విస్తీర్ణంలో వాల్మీకి గుహలు, 15 ఎకరాల విస్తీర్ణంలో బిల్లసర్గం గుహలను అభివృద్ధి చేస్తున్నారు. గుహల సమీపానికి వాహనాలు వెళ్లేలా రహదారులను నిర్మించారు. గుహ లోపల యాత్రికులు నడిచేందుకు వీలుగా బండపరుపు, మెట్లు వేశారు. గుహల బయట చిన్నారులు ఆడుకునేందుకు ఆట స్థలాలు, పార్కులు, విడిది కేంద్రాలు శరవేగంగా నిర్మిస్తున్నారు. రెస్టారెంట్లను కూడా నెలకొల్పుతున్నారు. వారం క్రితం ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన బిల్లసర్గం గుహలను పరిశీలించి పనుల పురోగతిపై ఆరా తీశారు. జనవరి నెలాఖారుకు ప్రారంభించేలా పనులను మరింత వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. గుహ ఆవరణలో యాత్రికులకు సదుపాయాలు కల్పించాలని సూచించారు.

పర్యాటక కేంద్రంగా డోన్

రాష్ట్రానికి ఆదర్శ నియోజకవర్గంగా నిలుస్తున్న డోన్ పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చెందుతోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డోన్ నియోజకవర్గాన్ని విద్య, వైద్య, పారిశ్రామిక, ఉపాధి, నీటిపారుదల రంగాలతో పాటు టూరిజం అభివృద్ధికి కూడా నిధులు సమృద్ధిగా విడుదల చేస్తున్నారు. ఓ వైపు విద్యా హబ్‌గా మారిన డోన్ పర్యాటక కేంద్రంగా విరాజిల్లనుంది. ఇప్పటికే డోన్ సమీపంలో నగర వనం ఏర్పాటు చేయడంతో పర్యాటకులను ఆకట్టుకుంటోంది. మరో వైపు వెంగళాంపల్లి, వెంకటాపురం చెరువును మినీ ట్యాంక్ బండ్, బోటు షికారు, రెస్టారెంట్లు ఏర్పాటు చేసేందుకు మరో రూ.6 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది.

జిల్లాకు మరింత గుర్తింపు



పర్యాటక రంగ అభివృద్ధిలో భాగంగా రెండు గుహలు అందుబాటులోకి రావడంతో నంద్యాల జిల్లాకు దేశ వ్యాప్తంగా మరింత గుర్తింపు లభించనుంది. డోన్ నియోజకవర్గం అభివృద్ధి అంతా మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి చొరవతోనే సాధ్యమైంది. నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడుస్తోంది.

– చిన్నకేశవయ్యగౌడ్, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్

ఉపాధి అవకాశాలు మెరుగు



పర్యాటక ప్రాంతాలుగా రెండు గుహలు అభివృద్ధి చెందడంతో పర్యాటకుల రద్దీ పెరిగి ఉపాధి అవకాశాలు మెరుగవుతాయి. డోన్ నియోజకవర్గంలో సహజ సిద్ధంగా ఏర్పడిన శిల్ప సంపదను కాపాడుతూ పర్యాటక కేంద్రంగా మార్చడం శుభపరిణామం. బుగ్గన హయాంలో ప్రాచీన దేవాలయాలు కూడా జీర్ణోద్ధరణకు నోచుకున్నాయి.

– వెంకటేశ్వరరెడ్డి, మెట్టుపల్లి, ప్యాపిలి మండలం

యాత్రికులను ఆకర్షించేలా..




బిల్లసర్గం, వాల్మీకి గుహలను అత్యంత సుందరంగా తీర్చిదిద్దుతున్నాం. గుహల్లో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. గుహల్లో బండపరుపు పనులు పూర్తయ్యాయి. రంగు రంగుల విద్యుత్ బల్బులను ఏర్పాటు చేశాం. మంత్రి బుగ్గన సూచన మేరకు ర్యాటకులకు అవసరమైన సదుపాయాలు కల్పిస్తున్నాం.


– ఈశ్వరయ్య, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఏపి టూరిజం శాఖ, కర్నూలు



వాల్మీకి గుహలో పనులు జరుగుతున్న దృశ్యం



ముఖద్వారం వద్ద చుట్టూ ఇనుప కంచె



వాల్మీకి గుహలో మెట్ల మార్గం



దిగువ అహోబిలంలో ఉత్తరద్వార దర్శనం కోసం బారులుదీరిన భక్తులు



దిగువ అహోబిలంలో గరుడవాహనంపై ఊరేగుతున్న శ్రీ ప్రహ్లాదవరదుడు

భక్త కోటి ప్రణమిల్లి..

- కనులపండువగా వైకుంఠ ఏకాదశి వేడుకలు
- భక్తులతో పోటెత్తిన ఆలయాలు
- ఉత్తర ద్వార దర్శనంతో తరించిన భక్తులు

ఆళ్లగడ్డ/శ్రీశైలం టెంపుల్/బేతంచెర్ల: పరమ పావనం.. ఉత్తర ద్వార దర్శనం అంటూ భక్తకోటి ప్రణమిల్లింది. వైకుంఠ ఏకాదశి సందర్భంగా శనివారం జిల్లాలోని ఆలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. అహోబిల క్షేత్రం ఇల వైకుంఠాన్ని తలపించింది. ఎగువ, దిగువ అహోబిల క్షేత్రాలకు భక్తజనం పోటెత్తారు. మంగళవాయిద్యాల నడుమ ఉభయ దేవేరులతో శ్రీఅహోబిలేశుడు ఉత్తర ద్వారం నుంచి దర్శన భాగ్యం కల్పించడంతో భక్తులు గోవింద నామస్మరణతో నీరాజనాలు అర్పించి తరించారు. ప్రహ్లాదవరదుడు ప్రత్యేకంగా అలంకరించిన గరుడ వాహనంపై కొలువై మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులను కనువిందు చేశారు. ఇల కై లాసమైన శ్రీశైల క్షేత్రంలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామివార్లకు ప్రత్యేక ఉత్సవం నిర్వహించారు. రావణవాహనంపై స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను ఉంచి గ్రామోత్సవాన్ని చేపట్టారు. వైష్ణవ పుణ్యక్షేత్రంగా ప్రసిద్ధికెక్కిన శ్రీలక్ష్మీ మద్దిలేటి నరసింహ స్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి వేడుకలు కనుల పండువగా కొనసాగాయి. భక్తజన సందోహం మధ్య శ్రీదేవి, భూదేవి సమేతుడైన మద్దిలేటి నరసింహస్వామి శాంతి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు.



శ్రీశైలంలో రావణవాహనంపై భక్తులకు దర్శనమిస్తున్న స్వామిఅమ్మవార్లు



మద్దిలేటిస్వామి కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న వేదపండితులు

వైజ్ఞానిక ప్రదర్శనలతో నూతన ఆవిష్కరణలు

- డీఈఓ సుధాకర్‌రెడ్డి

నంద్యాల(న్యూటౌన్): వైజ్ఞానిక ప్రదర్శనలతో విద్యార్థులు నూతన ఆవిష్కరణలకు నాంది పలుకుతారని డీఈఓ సుధాకర్‌రెడ్డి అన్నారు. శనివారం నంద్యాల పట్టణంలోని శ్రీగురురాజ ఇంగ్లిష్ మీడియం పాఠశాల ఆవరణలో జిల్లా స్థాయి వైజ్ఞానిక బాలల ప్రదర్శన పోటీలు నిర్వహించారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల నుంచి 130 సైన్స్ ప్రాజెక్టులు ప్రదర్శించారు. ప్రాజెక్టులు జీవ శాస్త్రం, రసాయన శాస్త్రం, భౌతిక శాస్త్రం, పర్యావరణ విభాగం, కంప్యూటర్ విభాగం నుంచి రూపొందించిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ నేటి బాలలు రేపటి శాస్త్రవేత్తలన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఈ పోటీలు ఎంతో దోహదం చేస్తాయన్నారు. భవిష్యత్‌లో మానవాళికి మనుగడకు అవసరమయ్యే ప్రాజెక్టుల రూపకల్పనపై దృష్టి సారించాలన్నారు. ముఖ్యంగా పర్యావరణ సంరక్షణ, ఆరోగ్యం, వ్యవసాయం, టెక్నాలజీ రంగానికి ఊతమిచ్చేలా ఉండాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారులు కె.సుందర్‌రావు, సుబ్బారెడ్డి, దీక్ష కో ఆర్డినేటర్ నాగేంద్రకుమార్, నిర్వహణ అధికారి కిరణ్‌కుమార్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయిపోటీలకు ఎంపిక..

ఈనెల 28, 29 తేదీల్లో కడప పట్టణంలోని సెయింట్ జోసెఫ్ పాఠశాలలో జరిగే రాష్ట్రస్థాయి ప్రదర్శనలకు జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీల్లో క్యాటగిరీ-1, క్యాటగిరీ-2ల నుంచి మూడు ప్రాజెక్టులు ఎంపికయ్యాయి. ఈ పోటీలకు ఆరుగురు విద్యార్థులు, ముగ్గురు ఉపాధ్యాయులు పాల్గొంటున్నట్లు జిల్లా సైన్స్ అధికారి సుబ్బారెడ్డి, సుందర్‌రావు తెలిపారు.



విజేతలతో డీఈఓ సుధాకర్‌రెడ్డి తదితరులు

వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలు వీరే..

కేటగిరీ-1లో

ఆటోమేటిక్ సోలార్ ట్రాకర్.. గంగాధర్‌రెడ్డి, జిల్లా పరిషత్ హైస్కూల్ దుద్యాల

ఫింగర్‌ప్రింట్ హాల్‌టికెట్.. నిఖిత, కేజీబీవీ, బండిఆత్మకూరు

ఆటోమేటిక్ డ్రైనేజీ క్లీనర్.. పూజ జెడ్పీహెచ్ఎస్, కొత్తపల్లి

కేటగిరీ-2

గ్యార్బేజ్ ప్రొటెక్షన్.. లావణ్య, అర్చన, కేజీబీవీ ప్యాపిలి

ఉమెన్ సేఫ్టీ.. ఎన్.మానస, ఎస్.యాబియా, జెడ్పీహెచ్ఎస్ నందివర్గం

ఆల్కహాలిక్ డిటెక్షన్ అలారం.. జశ్వంత్, కె.విశాల్ జీహెచ్ఎస్ కోవెలకుంట్ల

కేటగిరీ-3

టి.పద్మావతి కేజీబీవీ శిరివెళ్ల

ప్రవల్లిక బీఆర్ అంబేడ్కర్ స్కూల్, ఆళ్లగడ్డ

షహనాజ్ జిల్లా పరిషత్ హైస్కూల్, బనగానపల్లె

పర్యావరణానికి రక్షణగా



పర్యావరణానికి ముప్పుగా మారుతున్న వ్యర్థాలను, ప్లాస్టిక్ వస్తువులను రీసైక్లింగ్ చేసే విధానంపై ప్రాజెక్టను రూపొందించాం. వ్యర్థాలను సక్రమమైన పద్ధతిలో ఎరువులుగా, కొన్ని ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్‌ను ఉపయోగకరమైన వస్తువులుగా తయారు చేసి అవగాహన కల్పించాం. క్యారీ బ్యాగ్‌లను ఎంజామ్స్ ద్వారా కరిగించి ప్లాస్టిక్ కాలుష్యాన్ని తగ్గించడం మా ప్రాజెక్టు ఉద్దేశం.

–లాష్య, అర్చన, కేజీబీవీ, ప్యాపిలి

సహజ వ్యవసాయం మేలు



రసాయన ఎరువులు, పురుగు మందుల వినియోగం లేకుండా వ్యవసాయం చేయడమే మా ప్రాజెక్ట్ ముఖ్య ఉద్దేశం. పశువుల పేడ, చెత్తా చెదారాన్ని కుళ్లింపజేసి సహజ ఎరువును తయారు చేసి వ్యవసాయంలో వినియోగిస్తే భూమిలో సహజతత్వం పెరిగి నాణ్యమైన ఆహార ధాన్యాల ఉత్పత్తి చేయవచ్చు. భూమిలో జీవుల జీవనానికి ఆటంకం కలుగకుండా భూమికి పోషకాలు అందించవచ్చు. పశుగ్రాసం కూడా కలుషితం కాకుండా పశువుల ఆరోగ్యం, పరిరక్షణ కోసం ఈ వ్యవసాయం ఉపయోగపడుతుంది.

– మానస, రూబియా, జెడ్పీహెచ్ఎస్, నందివర్గం,

వ్యవసాయాన్ని పండుగ చేసిన సీఎం జగన్

కర్నూలు(అగ్రికల్చర్): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యవసాయాన్ని పండుగ చేయడంతో పాటు రైతుల అభ్యున్నతికి విశేషంగా కృషి చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వంగాల భరత్‌కుమార్‌రెడ్డి అన్నారు. వైఎస్సార్‌సీపీ రైతు విభాగం ఆధ్వర్యంలో శనివారం కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతుల మధ్య జాతీయ రైతు దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.ప్రభాకర్‌రెడ్డితో కలసి కేక్ కట్ చేసి రైతులకు తినిపించారు. ఈ సందర్భంగా భరత్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతుభరోసా పథకంతో అన్నదాతలకు పెట్టుబడి సమస్యలు తగ్గాయన్నారు. రూపాయి ప్రీమియం లేకుండా ఉచిత పంటల బీమా సదుపాయాన్ని కల్పిస్తోందన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసరెడ్డి, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

రుద్రవరం: తిమ్మనపల్లె మెట్ట వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అప్పనపల్లెకు చెందిన బాల నాగమ్మ(50) అనే మహిళ మృతి చెందగా మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. అప్పనపల్లెకు చెందిన కృష్ణయ్య, లక్ష్మి నరసమ్మ, బాలనాగమ్మ వైకుంఠ ఏకాదశి సందర్భంగా అహోబిల క్షేత్రానికి వెళ్తుండగా తిమ్మనపల్లె వద్ద బైక్ అదుపు తప్పి కింద పడ్డారు. ఈ ప్రమాదంలో గాయపడిన ముగ్గురిని చికిత్స నిమిత్తం 108లో ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. బాలనాగమ్మ పరిస్థితి విషమంగా ఉండటంతో నంద్యాలకు తరలించగా కోలుకోలేక ఆమె మృతి చెందింది.

ఐదుగురు డిబార్


కర్నూలు కల్చరల్: డిగ్రీ మూడో సెమిస్టర్ పరీక్షల్లో కాపీయింగ్‌కు పాల్పడుతుండగా ఐదుగురు విద్యార్థులను డిబార్ చేసినట్లు రాయలసీమ యూనివర్సిటీ పరీక్షల విభాగం డీన్ ఆచార్య నాగస్వరం నరసింహులు శనివారం విలేకరులకు తెలిపారు. చాగలమర్రి సెయింట్స్ ఆన్స్ ఉన్నత పాఠశాలలో ముగ్గురు, కోవెలకుంట్ల ఎస్‌వీబీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నంద్యాల పీఎస్‌సీ అండ్ కేవీఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఒక్కొక్కరు చొప్పున డిబార్ అయ్యారని పేర్కొన్నారు. శనివారం డిగ్రీ మూడో సెమిస్టర్ పరీక్షను 67 కేంద్రాల్లో నిర్వహించినట్లు చెప్పారు. ఉదయం సెషన్‌లో జరిగిన పరీక్షకు 9,711 మందికి గాను 8,887 మంది హాజరు కాగా 824 మంది గైర్హాజరయ్యారన్నారు.


కర్నూలు: వెంకటరమణ కాలనీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారు


మహానంది: ఉత్తర ద్వారంలో పూజలు చేస్తున్న పండితులు


కృష్ణగిరి: కర్లకుంటలో శ్రీవారికల్యాణం జరిపిస్తున్న వేదపండితులు


జూపాడుబంగ్లా: అలంకరణలో తర్తూరు రంగనాథస్వామి ఆలయ ముఖద్వారం

బేతంచెర్ల: మద్దిలేటిస్వామి ఆలయంలో భక్తుల రద్దీ



అవుకు: చెన్నకేశవస్వామి ఆలయంలో ఉత్తర ద్వారం వద్ద పోటెత్తిన భక్తులు

'వైకుంఠ' వైభోగం

గోవింద నామస్మరణతో ఆలయాలు మార్మోగాయి... వేదమంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల మధ్య వైకుంఠ ఏకాదశి వేడుకలు ఘనంగా జరిగాయి.. శనివారం జిల్లాలోని ప్రముఖ వైష్ణవాలయాలు భక్తులతో కిక్కిరిశాయి. ఉత్తర ద్వారంలో భక్తులకు శ్రీ వేంకటేశ్వర స్వామి దర్శనమిచ్చారు. పలు చోట్ల స్వామి అమ్మవార్ల కల్యాణోత్సవం రమణీయంగా సాగింది. నంద్యాలలో దేవాలయాలను మకర తోరణాలతో అలంకరించి.. శ్రీదేవి, భూదేవి సహిత వెంకటేశ్వరస్వామికి పంచామృతాభిషేకాలు చేశారు. డోన్ పట్టణంలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. ఎమ్మిగనూరులో అశేష భక్తజనం మధ్య రథోత్సవాన్ని నిర్వహించారు. వెల్దుర్తి మండలం రామళ్లకోటలో గ్రామోత్సవం కనుల పండువగా సాగింది. మద్దికెర మండలం పెరవలిలో శ్రీరంగనాథస్వామి గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. అవుకు పట్టణంలో తితిదే బృందం ఆలపించిన అన్నమయ్య సంకీర్తనలు అలరించాయి. ఆస్పరి మండలం హలిగేర గ్రామ సమీపంలోని కొండల్లో సహజ సిద్ధ ఉత్తర ముఖ ద్వారంగా వెలసిన కూర్మనారాయణస్వామిని భక్తులు దర్శించుకున్నారు. కర్నూలు నగరంలోని వైష్ణవాలయాలు భక్తులతో సందడిగా దర్శనమిచ్చాయి.
– సాక్షినెట్‌వర్క్


నంద్యాల: సంజీవనగర్ రామాలయంలో వెంకటేశ్వరస్వామికి ప్రత్యేక అలంకరణ


పాణ్యం: ముగ్గులో వీరనారాయణ స్వామి


శ్రీశైలం: స్వామి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు


ఎమ్మిగనూరు: వెంకటసాయి దేవాలయం వద్ద..


కర్నూలు: కృష్ణానగర్‌లో వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద క్యూ

ఇష్టం లేని పెళ్లి చేస్తున్నారని యువతి ఆత్మహత్య

ఎమ్మిగనూరురూరల్: తనకు ఇష్టం లేని పెళ్లి చేస్తున్నారని మనస్తాపంతో శనివారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకొని యువతి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన పట్టణంలోని గోనెగండ్ల రోడ్డులో చోటు చేసుకుంది. భర్త చిన్న రంగస్వామి అనారోగ్యంతో మృతి చెందడంతో గోనెగండ్లకు చెందిన పెద్ద మునెమ్మ కొంత కాలంగా ఎమ్మిగనూరు పట్టణంలోని గోనగండ్ల రోడ్డులో ఇల్లు అద్దెకు తీసుకొని నివాసముంటోంది. కుమార్తె మంజుల(21)కు పత్తికొండకు చెందిన అబ్బాయితో పెళ్లి నిశ్చయించారు. అయితే పెళ్లి ఇష్టం లేదని మంజుల మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుంది. బయట నుంచి ఇంటికి వచ్చిన తల్లి.. కుమార్తెను చూసి కిందకు దించి చికిత్స కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతురాలి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మస్తాన్‌వలి చెప్పారు.

నిర్దేశిత చార్జీలు మాత్రమే వసూలు చేయాలి


మాట్లాడుతున్న చైర్మన్ చక్రపాణిరెడ్డి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలదేవస్థానం పరిధిలోని ఆటో, ట్యాక్సీల్లో నిర్దేశిత చార్జీలు మాత్రమే వసూలు చేయాలని ధర్మకర్తల మండలి చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి సూచించారు. శనివారం క్షేత్ర పరిధిలోని ఆటో, ట్యాక్సీ నిర్వాహకులతో డి.పెద్దిరాజు, సీఐ దివాకర్‌రెడ్డి, ఎస్ఐ జి.లక్ష్మణరావులతో కలిసి దేవస్థానం కార్యాలయ భవనంలో సమావేశం నిర్వహించారు. ఈఓ మాట్లాడుతూ ఆటో ట్యాక్సీల డ్రైవర్లు భక్తులతో మర్యాదగా మెలగాలని, ముఖ్యంగా ప్రమాదాలు నిరోధించేందుకు వేగపరిమితిని పాటించాలన్నారు. సీఐ మాట్లాడుతూ స్థానికంగా ఒక్కొక్కరికి లోకల్ లింక్ సర్వీసుకు రూ.20, లోకల్ సైట్ సీయింగ్‌కు పోనురాను చార్జీలు రూ.100, లోకల్ సైట్‌సీయింగ్, శ్రీశైలం ప్రాజెక్ట్ సందర్శనకు పోనురాను చార్జీగా రూ.150, శ్రీశైలం నుంచి లింగాలగట్టుకు రూ.120, శ్రీశైలం నుంచి సున్నిపెంటకు రూ.100 మాత్రమే తీసుకోవాలని సూచించారు. ఆటో రేట్ల పట్టికను తప్పనిసరిగా ప్రదర్శింపజేయాలన్నారు. ఈ రేట్ల పట్టికల స్టిక్కర్లను దేవస్థానమే అందజేస్తుందని చెప్పారు.

'తట్టు'కోలేక చిన్నారి మృతి!

హొళగుంద: తట్టు (అమ్మోరు) పోసి హెబ్బటం గ్రామానికి చెందిన చిన్నారి భానుప్రియ(4) శుక్రవారం సాయంత్రం మృతి చెందింది. ఉప్పర శ్రీకాంత్, లక్ష్మి దంపతుల కుమార్తె భానుప్రియకు నాలుగు రోజుల క్రితం తట్టు పోసింది. శుక్రవారం తీవ్రంగా జ్వరం రావడంతో ఆర్ఎంపీ వద్దకు తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ఆయన సూచన మేరకు ఆదోనికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో చిన్నారి మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు.

ఆటో బోల్తా పడి వృద్ధుడి దుర్మరణం

ఆళ్లగడ్డ: పట్టణ శివారులోని పాలసాగరం రోడ్డులో ఆటో బోల్తాపడి ఓ వృద్ధుడు మృతి చెందాడు. కోట కందుకూరు గ్రామానికి చెందిన చాకలి దండు పెద్ద సుబ్బరాయుడు (80) అనే వృద్ధుడు పట్టణంలో బట్టలు ఇస్త్రీ చేసి జీవనోపాధి పొందేవాడు. ఈ క్రమంలో రోజు మాదిరిగానే శనివారం పట్టణంలో పని ముగించుకుని గ్రామానికి వెళ్లేందుకు ఆటోలో ఎక్కాడు. ఆటో పాలసాగరం సమీపంలోకి వెళ్లే సరికి ఎదురుగా మోటర్‌సైకిల్ రావడంతో తప్పించబోయిన డ్రైవర్ ఆటోను వేగంగా పక్కకు తిప్పాడు. దీంతో అదుపు తప్పి ఆటో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో చాకలి దండు పెద్ద సుబ్బరాయుడు మృతి చెందగా అందులో ప్రయాణిస్తున్న మరో ముగ్గురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కొనసాగుతున్న నవకోటి మహాయజ్ఞం

శ్రీశైలం: క్షేత్ర పరిధిలోని వాసవీ విహార్ ప్రాంగణంలో బ్రహ్మశ్రీ సద్గురు జగన్నాథ స్వామి పొన్నూరు ఆశ్రమ సేవా ఆధ్వర్యంలో నవకోటి జప అష్ట వింశతి మహాయజ్ఞ క్రతువు కొనసాగుతోంది. ఈనెల 22న ప్రారంభమైన ఈ యజ్ఞం 26వ తేదీన పూర్ణాహుతితో ముగుస్తుందని యల్లాప్రగడ పవన్‌కుమారశర్మ శనివారం తెలిపారు. లోక కల్యాణార్థం దేశ వ్యాప్తంగా ఈ యజ్ఞాన్ని జగన్నాథస్వామి ఆశ్రమ సేవా సమితి నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పూజల్లో భాగంగా విఘ్నేశ్వర పూజ, పుణ్యహవాచణం, జ్యోతిప్రజ్వలన, సామూహిక హోమాలు, జగన్నాథస్వామివారి దివ్యలీలలపై ప్రవచనాలు, భజనలుతో పాటు పద్మావతి సమేత శ్రీనివాస కల్యాణమహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. చివరి రోజు 26వ తేదీన జప, హోమాది క్రతువులతో పాటు పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.


హోమాలు నిర్వహిస్తున్న దృశ్యం

నేడు కార్తీక మాస శివదీక్ష విరమణ

శ్రీశైలంటెంపుల్: కార్తీకమాస శివదీక్షా విరమణ కార్యక్రమం ఆదివారం ఉదయం నుంచి ప్రారంభిస్తున్నట్లు డి.పెద్దిరాజు తెలిపారు. భక్తుల సౌకర్యార్థం ఐదు రోజుల పాటు ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తామన్నారు. పాతాళగంగ మార్గములోని శివదీక్షా శిబిరాలలో దీక్షా విరమణ కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. నవంబర్ 14న శివ మండల దీక్షను, డిసెంబర్ 3న అర్ధమండలదీక్షను స్వీకరించిన భక్తులు ఈ దీక్షా విరమణ సమయంలో దీక్షను విరమించవచ్చన్నారు. దీక్షా విరమణను పురస్కరించుకుని ఆదివారం ఉదయం స్వామివారి ఆలయ దక్షిణద్వారం వద్ద శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామివార్ల ఉత్సవమూర్తులను ఊరేగింపుగా పల్లకీలో శివదీక్ష శిబిరానికి చేర్చుతామన్నారు. దీక్ష స్వీకరించిన భక్తులకు క్యూలైన్ ద్వారా స్వామివార్ల దర్శనం కల్పిస్తామన్నారు.